

వేధింపుల బదిలీలు

జిల్లా పంచాయతీ కార్యాలయంలో జరిగిన అక్రమాలను ప్రశ్నించిన పంచాయతీ కార్యదర్శులపై బదిలీల పేరుతో అధికారులు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు.

- 8లో..



కారు, ఆటో ఢీకొని ఇద్దరు మృతి

కారు–ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరో ఎనిమిది మందికి తీవ్రగాయాలైన ఘటన చినారికట్ల జంక్షన్ సమీపంలో శనివారం జరిగింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
38 /29

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఎయిడెడ్ విద్యార్థులకు వసతులు కల్పించాలి

ఒంగోలు సిటీ: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రస్తుతం పనిచేస్తున్న 135 ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే వెంకట్రావు, సీహెచ్ ప్రభాకర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతి తరగతికి చెందిన విద్యార్థులు కూర్చునేందుకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో సమానంగా బెంచీలు, తరగతి గదులకు ఫ్యాన్లు, ఐఎఫ్ఎల్ ప్యానల్ టీవీలు, విద్యార్థులకు మంచినీటి వసతి కల్పించి ప్రభుత్వ విద్యార్థులకు ఇచ్చే ఆట వస్తువులు, పాఠశాల గ్రాంట్ విడుదల చేసి ఎయిడెడ్ పాఠశాలలకు పూర్వ వైభవం వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

షూటింగ్ చాంపియన్‌షిప్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



రైఫిల్‌లో గురి చూస్తున్న జిల్లా విద్యార్థులు

ఒంగోలు టౌన్: ఈ నెల 21వ తేదీ నుంచి 30 వరకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో జరుగుతున్న 25వ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఈ పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 9 మంది రైఫిల్, ఇద్దరు పిస్టల్ షూటింగ్ విభాగాల్లో విజయం సాధించారు. తదుపరి అహ్మదాబాద్, త్రివేండ్రంలలో ఆగస్టులో జరిగే సౌత్‌జోన్ ప్రీ నేషనల్స్‌కు అర్హత సాధించారు. షేక్ సదా ఫాతిమా, గంధం ఉషశ్రీ, రేష్మ, సాయి భ్రమర, కె.హనూష, లక్షణ్య, షేక్ అజ్మల్ హుసేన్, సిద్దా ఆదిత్య, నల్లూరి సాయి మనీష్, చక్కా శ్రీమంలుత్‌రైఫిల్ విభాగంలో, సత్యేంద్ర పయ్యావుల, కోడూరి వెంకట సాయి పిస్టల్ విభాగంలో అర్హత సాధించారు. ప్రతిష్టాత్మక ఒలింపిక్ లక్ష్యంగా షూటింగ్ క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన స్కూలు యాజమాన్యానికి కోచ్, స్టేట్ రైఫిల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కమ్మ ఖాదర్ బాబు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా సర్పంచుల సంఘ కన్వీనర్‌గా రామారావు యాదవ్

ఒంగోలు సబర్బన్: జిల్లా సర్పంచుల సంఘ కన్వీనర్‌గా బట్టు రామారావు యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా సర్పంచుల సంఘం కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీరభద్రాచారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న పది నెలల కాలంలో సర్పంచుల సమస్యలపై స్పందించి, వాటి పరిష్కారం దిశగా పని చేయాలని నూతన కన్వీనర్‌కు సూచించారు. ఈ సందర్భంగా నూతన కన్వీనర్ బట్టు రామారావు యాదవ్ మాట్లాడుతూ తనపై ఉంచిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు.

గ్రీన్ అంబాసిడర్ వేతనాలు ప్రభుత్వమే భరించాలి:



కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసిన సర్పంచుల సంఘం నూతన కమిటీ

గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించే గ్రీన్ అంబాసిడర్ వేతనాలు గతంలోలా ప్రభుత్వమే భరించాలని సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి, నూతన కమిటీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు నూతన కమిటీ కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను మర్యాద పూర్వకంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలిశారు. శానిటేషన్ పేరుతో ప్రత్యేక చర్యలు చేపట్టిన ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల వేతనాల విషయంలో స్పందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు లాజర్, ఎస్.మోహన్‌రెడ్డి, ప్రసాద్, పీ.మల్లీశ్వరి, పోశం సుమలత, సీహెచ్.విజయ, వీణ తదితరులు పాల్గొన్నారు.

భూదందా.. జబర్దస్తీ..!

నగరంలో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు పచ్చగద్దలు వాలిపోతున్నాయి. అధికారాన్ని అడ్డంపెట్టుకుని రూ.కోట్ల విలువజేసే స్థలాలను మింగేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. జబర్దస్తీగా కబ్జా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీ నేతల మాటలకు కార్పొరేషన్ అధికారులు తందానా అంటూ ఎంతో విలువైన స్థలాలను వారికి అప్పనంగా కట్టబెట్టేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలో ఒక వైపు చిరువ్యాపారులపై ప్రతాపం చూపిస్తున్న అధికారులు దొడ్డిదారిన అధికార టీడీపీ నేతలకు ఎలా కట్టబెడతారంటూ అధికారులను ప్రజలు నిలదీస్తున్నారు.



మున్సిపల్ స్థలంలో అక్రమంగా చేపడుతున్న శాశ్వత నిర్మాణం

- ఖాళీ స్థలాలపై వాలిపోతున్న పచ్చపార్టీ నేతలు
- రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూముల స్వాహాకు యత్నం
- అధికార పార్టీ అండదండలతో చెలరేగుతున్న పచ్చ తమ్ముళ్లు
- తాత్కాలిక అనుమతులు తీసుకొని శాశ్వత కట్టడాలు
- చేతులు తడిపితే సంతకాలు పెట్టేస్తున్న కార్పొరేషన్ అధికారులు
- నిబంధనలకు వ్యతిరేకంగా పాత కూరగాయల మార్కెట్ స్థలంలో రెస్టారెంట్ నిర్మాణం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఓ పథకం ప్రకారం కోటవీధిలో ఉన్న ఉర్దూ స్కూలును నేలమట్టం చేశారు. రూ.35 కోట్లు విలువైన ఈ స్థలాన్ని దొడ్డిదారిన కాజేసేందుకు తెలుగు తమ్ముళ్లు ప్రయత్నిస్తున్నారు. నగరం నడిబొడ్డున ఉన్న మరో విలువైన స్థలంపై కన్నేశారు పచ్చనేతలు. పాత కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న మున్సిపల్ స్థలాన్ని కబ్జా చేసేందుకు తెగబడ్డారు. నిబంధనలు, తీర్మానాలు, ప్రజల అనుమతి లేకుండానే ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడుతున్నారు. రూ.కోట్ల విలువైన స్థలాలను కారుచవగ్గా కట్టబెట్టడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తాత్కాలిక అనుమతులు తీసుకొని...

నగరంలోని పాత కూరగాయల మార్కెట్ వద్ద 83 సెంట్ల ఖాళీ స్థలం ఉంది. దీనిని తరచుగా ఎగ్జిబిషన్లు, వ్యాపార ప్రమోషన్లకు తాత్కాలిక ఒప్పందంపై అద్దెకు ఇస్తుంటారు. తద్వారా నగర పాలక సంస్థకు ఆదాయం వస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ స్థలంపై పచ్చ తమ్ముళ్ల కన్ను పడింది. కోట్ల రూపాయల విలువైన ఈ స్థలాన్ని ఎలాగైనా సరే స్వాహా చేయాలని ప్రయత్నాలు మొదలెట్టారు. విషయాన్ని నియోజకవర్గంలో చక్రం తిప్పుతున్న కీలక నేత చెవిలో ఊదారు. అంతే ఆయన గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో కబ్జాకు శ్రీకారం చుట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి కార్పొరేషన్ అధికారులు జీ హుజూర్ అనడంతో ప్లాన్ పట్టాలెక్కింది. ఏదైనా వీధిలో తాత్కాలికంగా చలువ పందిళ్లు, రేకుల గుడారాలు వేసుకునేందుకు చదరపు మీటరుకు రూ.100 ప్రకారం టౌన్‌ప్లానింగ్ అధికారులు అద్దెకు ఇస్తుంటారు. ఇదే తరహాలో పాత మార్కెట్ వద్ద ఉన్న మున్సిపల్ స్థలానికి జిల్లా తెలుగు యువత నాయకుడు ఒకరు తాత్కాలిక పద్ధతిలో అనుమతి తీసుకున్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఇనుప పిల్లర్లు వేసి శాశ్వత కట్టడం నిర్మిస్తుంటే కార్పొరేషన్ అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. నగరం నడిబొడ్డున నిత్యం వందలాది మంది ప్రజలు తిరుగుతున్న ప్రాంతంలో నిర్మాణాలు జరుగుతుండడం చర్చనీయాంశంగా మారింది.

ప్రతి 6 నెలలకు పర్మిషన్ పెంచేలా...

నిజానికి ప్రభుత్వ స్థలాలను బీఓటీ (బిల్డ్ ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్) పద్ధతిలో కాని, నేరుగా కానీ లీజుకు ఇస్తారు. కొన్ని స్థలాలను తాత్కాలిక పద్ధతిలో అద్దెకు ఇస్తుంటారు. వారం రోజుల నుంచి 6 నెలల కాల వ్యవధితో అద్దెకు ఇస్తుంటారు. సంవత్సరం దాటితే కౌన్సిల్‌లో తీర్మానం చేయాలి. తీర్మానం చేసిన తరువాత ఓపెన్ యాక్షన్‌కు పిలిచి ఎవరైతే ఎక్కువ కోడ్ చేస్తారో వారికి అద్దెకు ఇవ్వాలి. అయితే పాత మార్కెట్ వద్ద స్థలం విషయంలో ఇందుకు విరుద్ధంగా జరుగుతోందని ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా శాశ్వత నిర్మాణాలు చేస్తున్నారు. కీలక నేత అండదండలతో తాత్కాలిక పద్ధతిలో అధికార టీడీపీకి చెందిన యువ నాయకుడు అద్దెకు తీసుకున్నట్లు సమాచారం. దీనికి 6 నెలల పాటు లీజు కొనసాగుతుంది. నిబంధనలకు వ్యతిరేకంగా మూడేళ్ల కాలపరిమితితో లీజు ఇవ్వాలని కమిషనర్‌పై ఒత్తిడి తీసుకొచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ప్రతి 6 నెలలకోసారి లీజు పెంచేలా ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తోంది.

వైఎస్సార్ సీపీ హయాంలో..

నగరంలో మున్సిపాలిటీకి చెందిన సుమారు 40కి పైగా ఖాళీ స్థలాలు ఉన్నట్లు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గుర్తించారు. వాటిల్లో ప్రధానమైన స్థలాలను కమర్షియల్ కాంప్లెక్సులుగా మార్చి అభివృద్ధి చేయాలని యత్నించింది. ఈ క్రమంలోనే పాత కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న 83 సెంట్ల స్థలాన్ని డిజైన్ చేయడానికి సీబీఆర్ఈ అనే సంస్థకు కౌన్సిల్ సీఆర్ నంబర్ 59/2022, జనవరి 11 తేదీ అనుమతి ఇచ్చింది. ఇంజినీరింగ్ విభాగం ప్రభుత్వ అనుమతి కోసం పంపించింది. అయితే ఇప్పుడు కూటమి పాలనలో దీనికి భిన్నంగా అయిన వారికి అప్పనంగా దోచి పెట్టేందుకు ప్రభుత్వ నిబంధనలకు తుంగలోకి తొక్కి అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. కౌన్సిల్‌లో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా, ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం లెక్క చేయకుండా తాత్కాలిక అనుమతులు తీసుకొని ప్రభుత్వ స్థలంలో శాశ్వత కట్టడాలు నిర్మిస్తుంటే కలెక్టర్ జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

తక్కువ మొత్తానికే లీజు..

నగరంలో అద్దెలు మండిపోతున్నాయి. ఇటీవల కాలంలో ఆక్రమణలు తొలగిస్తుండడంతో అద్దెలు విపరీతంగా పెరిగిపోయాయి. పాత మార్కెట్లో చుట్టు పక్కల ఎక్కడైనా సరే ఒక చిన్న గది తీసుకోవాలంటే రూ.10 వేల అద్దె ఉంది. అలాంటిది 83 సెంట్ల స్థలంలో 10 ఇంటు 15 విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న దుకాణానికి అతి తక్కువ అద్దె వసూలు చేసేలా నగర పాలక సంస్థ అధికారులు అనుమతులు ఇవ్వడం మతలబు ఏంటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇక్కడ రెస్టారెంట్ ఏర్పాటు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. ఇప్పటికీ ఈ ప్రాంతంలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల వృద్ధురాలిని ట్రావెల్ బస్సు ఢీకొంది. ఘటనా స్థలంలోనే ఆమె మరణించింది. ఇలాంటి ప్రమాదాలు ఇక్కడ తరుచూ జరుగుతున్నాయి. అయినా సరే ఈ ప్రాంతంలో రెస్టారెంట్ ఏర్పాటు చేయడానికి అధికారులు ఎలా అనుమతి ఇచ్చారో దేముడికే ఎరుక.

ఓటు లేని వారు ఓటు నమోదు చేసుకోవాలి

ఒంగోలు సబర్బన్: జిల్లా వ్యాప్తంగా ఓటు హక్కు లేని వారు తప్పనిసరిగా తమ ఓటు నమోదు చేసుకోవాలని ఒంగోలు ఆర్‌డీఓ కే.లక్ష్మీ ప్రసన్న చెప్పారు. స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఒంగోలు ఆర్‌డీఓ లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. ఓటు లేని వారు ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోని వారు వెంటనే ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని కోరారు. ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోని వారి ఓట్లు తొలగిస్తామన్నారు. ఒంగోలు నియోజకవర్గ ఓటర్ల జాబితా ఎటువంటి తప్పులు లేకుండా సరిచేస్తామని, చనిపోయిన వారి ఓట్లను తొలిగించాలని అధికారులను కోరారు. పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై దృష్టి పెట్టాలన్నారు. సలహాలు సూచనలను పార్టీల సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్ మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గంలో ఆధార్ అనుసంధానం ఎంత శాతం జరిగిందని, ఆధార్ అనుసంధానం చేసుకోని వారిపై ఎలాంటి చర్యలు ఉంటాయని అడిగారు. ఒంగోలు నగరంలో డోర్ నంబర్ల సమస్య ఉందని, నగరంలోని అన్ని డివిజన్లలో డోర్ నంబర్లు లేవని, కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారికి పెద్ద సమస్యగా ఉందని, వెంటనే ఒంగోలు నగరంలో డోర్ నంబర్లు వేయించాలని కోరారు. గత రాజకీయ పార్టీల సమావేశాల్లో ఒంగోలు నగరంలో డోర్ నంబర్లు వేయిస్తామని డీఆర్‌ఓతో పాటు ఇతర రెవెన్యూ, నగర పాలక సంస్థ అధికారులు హామీ ఇచ్చారని, ఆ పని ఎంత వరకు వచ్చిందో చెప్పాలన్నారు. చనిపోయిన వారి ఓట్లు వెంటనే తొలిగించాలని, నగరంలో కొన్ని పోలింగ్ స్టేషన్ల ప్రైవేటు స్కూల్స్‌లో ఉన్నాయని, ఆయా స్కూల్ యాజమాన్యాలు వాటిని తొలగించాలని కోరుతున్నాయని, ఎన్నికల కమిషన్ ఆలోచించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్‌కు రిపోర్ట్ చేయాలని దామరాజు క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఒంగోలు ఆర్‌డీఓ లక్ష్మీ ప్రసన్న

వేలం బహిష్కరించిన రైతులు



నిరసన తెలుపుతున్న పొగాకు రైతులు

- కనిగిరి పొగాకు బోర్డు వద్ద భైఠాయించి నిరసన

కనిగిరిరూరల్: అన్ని రకాల పొగాకు బేళ్లను కొనుగోలు చేయాలని, మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయాలని, నోబిడ్ లేకుండా తెచ్చిన బేళ్లన్నీ కొనుగోలు చేయాలని కోరుతూ శనివారం అలవలపాడు క్లస్టర్ పరిధిలోని రైతులు వేలం పాటను బహిష్కరించి నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళితే అలవలపాడు క్లస్టర్ పరిధిలోని సుమారు 6 గ్రామాల రైతులు 644 పొగాకు బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. కనిష్ట ధర కేజీ రూ.150 ఇస్తున్నారని, బేళ్లను తిప్పి పంపకుండా అన్ని రకాల బేళ్లను పూర్తిగా సరైన ధర ఇచ్చి కొనుగోలు చేయాలని వేలం ప్రారంభంలో అధికారులను, బయ్యర్లను రైతులు కోరారు. దానికి వారు సమ్మతించలేదు. దీంతో రైతులు వేలాన్ని బహిష్కరించి గేటు ముందు బైఠాయించి నిరసన తెలిపారు.

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి

ఈ సందర్భంగా రైతు సంఘ నాయకులు పిల్లి తిప్పారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం స్పందించి మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం చేయకుండా రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. రైతుల వద్ద గ్రేడ్ వన్ రకం మాత్రమే కొని మిగతా వాటిని ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాల వైఫల్యంపై తీవ్రంగా మండిపడ్డారు. బోర్డు సూపరింటెండెంట్ రైతుల పక్షాన లేకుండా వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బీ శ్రీను, ప్రతాప్, వెంకటేశ్వర్లు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన సమస్యలు పరిష్కరించండి



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శులు

- లేకుంటే సామూహిక సెలవుకు వెనకాడం
- గ్రామాల్లో పనిచేయటానికి తగినంత సిబ్బందిని ఇవ్వాలి
- కలెక్టరేట్ ముందు పంచాయతీ కార్యదర్శుల ధర్నా

ఒంగోలు సబర్బన్: గ్రామ పంచాయతీ కార్యదర్శుల న్యాయమైన డిమాండ్లు, కోర్కెలను తీర్చకపోతే సామూహిక సెలవుపై వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు జిల్లా కేంద్రం ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం ముందు శనివారం అసోసియేషన్ నాయకులు, పంచాయతీ కార్యదర్శులు మధ్యాహ్న భోజన విరామ సమయం నుంచి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తీరు ఒకలా ఉంటే జిల్లాలోని పంచాయతీ అధికారుల తీరు మరీ దారుణంగా ఉందంటూ అసోసియేషన్ నాయకులు ధ్వజమెత్తారు. డీపీఓకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్ర అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎం.బెన్‌హర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ కమిషనర్ ఇటీవల వీడియో కాన్ఫరెన్స్‌లో చెత్త సేకరణ, క్లోరినేషన్ చేసేటప్పుడు పంచాయతీ కార్యదర్శులంతా ఉదయం 6 గంటలకే గ్రామ పంచాయతీలో దినపత్రికలు చేత పట్టుకొని ఫొటోలు దిగాలి అని చెప్పటం అత్యంత దారుణమన్నారు. పంచాయతీ కార్యదర్శులకు సొంత మండలంలో పోస్టింగ్ ఇవ్వడం లేదని, అధిక భాగం నివాసానికి దూరంగా 50 నుంచి 100 కిలో మీటర్ల దూరంలో విధులు నిర్వహిస్తున్నారన్నారు. గ్రామ పంచాయతీలో అన్నిరకాల సర్వేలు, స్వర్ణ పంచాయతీ పనులు, ఇంటి పన్నుల వసూళ్లు, యాప్, గ్రామ సచివాలయ సర్వేలు, రెవెన్యూ పనులు, గ్రామసభలు, సమావేశాలు, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, ఎన్నికల విధులు, ప్రొటోకాల్ విధులు, ఇలా చాలా రకాల పనులు పంచాయతీ కార్యదర్శులు మాత్రమే చేస్తున్నారని చెప్పారు. పంచాయతీ కార్యదర్శుల ప్రాథమిక విధులైన పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్లు సక్రమంగా నిర్వహించేందుకు సరైన సిబ్బంది లేరని, తగిన వనరులు కావాల్సి ఉందన్నారు. ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులందరూ ఉద్యోగ నిర్వహణలో విపరీతమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలకు పారిశుధ్య కార్మికులను నియమించకుండా కేవలం రూ.6 వేల గ్రామ పంచాయతీల గ్రాంట్ నుంచి పారిశుధ్య కార్మికులకు చెల్లించాలనే ఆదేశాలు ఇచ్చారన్నారు. గ్రామాల్లో రూ.6 వేలకు చెత్త సేకరణ చేయడానికి ఎవరూ ముందుకు రాని పరిస్థితిలో పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. దీనివల్ల వారు పని భారం తట్టుకోలేక మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. తమ న్యాయమైన కోర్కెలు తీర్చకపోతే సామూహిక సెలవులోకి వెళతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కె.వెంకట్రావు, పి.నాగేశ్వరరావు, బి.మల్లిఖార్జున రావు, కే.జ్యోత్న, పరాశరం, విజయపాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

అండర్ 16 జిల్లా క్రికెట్ జట్టు ఇదే



అండర్ 16 జిల్లా క్రికెట్ జట్టు

ఒంగోలు: అండర్ 16 జిల్లా క్రికెట్ జట్టు జాబితాను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21న స్థానిక మంగమూరు డొంకలోని ఏసీఏ సబ్ సెంటర్ నెట్స్‌లో నిర్వహించిన ప్రాథమిక ఎంపికకు 80 మందికిపైగా క్రీడాకారులు హాజరయ్యారన్నారు. వారిలో 29 మందితో ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశామని, వారికి బాపట్ల జిల్లా రావినూతల క్రికెట్ స్టేడియంలో ప్రాబబుల్స్ మ్యాచ్‌లు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారితో తుది జట్టును ఎంపిక చేశామన్నారు. ఎంపికైన క్రీడా జట్టు జూలై 3 నుంచి మంగళగిరి పేరేచర్లలో జరిగే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఎంపిక ప్రక్రియను అధ్యక్షుడు నవీన్‌కుమార్, సంయుక్త కార్యదర్శి బచ్చు శ్రీనివాసరావు, కోశాధికారి హనుమంతరావు, సభ్యులు బలరాం, కోచ్‌లు చంద్రశేఖర్, బాబూరావు పర్యవేక్షించారు.

జట్టు: పి.సుమిత్ సందేశ్ (కెప్టెన్), ఆర్.హేమంత్‌రాయల్ (ఉపాధ్యక్షుడు), సీహెచ్ భవిష్, ఎస్.అభినవ్, టి.శశాంక్, డి.మార్టిన్, కె.రామ్‌చరణ్, ఐ.కుషీశ్వర్ శర్మ, ఎం.పృథ్వీరాజ్, ఎం.దిండు గణేష్ రామ్, సీహెచ్ సుప్రీత్, ఎం.సిద్దార్థ, జి.అరవింద్, కె.వైభవ్, జె.దినేష్, డి.కెల్విన్, స్టాండ్ బైలుగా బి.వినయ్, జి.జస్వంత్, బి.నిశాంత్, వి.రిషిక్ చక్రవర్తి.

లో గ్రేడ్ పొగాకును రూ.20 వేలకు కొనుగోలు చేయాలి

ఒంగోలు టౌన్: పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, అన్నీ రకాల లో గ్రేడ్ పొగాకును క్వింటాలుకు రూ.20 వేలకు కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు డిమాండ్ చేశారు. స్థానిక ఎల్బీజీ భవనంలో శనివారం రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జజ్జూరి జయంతి బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ వర్జీనియా పొగాకు రేటు రోజురోజుకూ పడిపోతుందని చెప్పారు. మేలు రకం పొగాకు మాత్రమే కొంటామని చెబుతున్న కంపెనీలు లో గ్రేడ్ పొగాకును తిరస్కరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లో గ్రేడ్ సాకుతో తక్కువ రేటుకు కొనుగోలు చేయాలన్న కుట్రతోనే పొగాకును తిరస్కరిస్తున్నారని మండిపడ్డారు. దీని వలన బ్యార్నీకి రూ.5 నుంచి రూ.6 లక్షల వరకు నష్టపోతున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. పొగాకు బోర్డు, ప్రభుత్వరంగ సంస్థలు వేలంలో పాల్గొని లో గ్రేడ్ పొగాకును రూ.20 వేల కు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు ఎస్కే బాబు, పెంట్యాల హనుమంతరావు, అబ్బూరి వెంకటేశ్వర్లు, తిరుపతి రెడ్డి, ముప్పరాజు బ్రహ్మయ్య, నెల్లూరు నరసింహరావు, పిల్లి తిప్పారెడ్డి, ఊసన వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రైతు సంఘం సమావేశంలో మాట్లాడుతున్న పమిడి వెంకటరావు

ఆశా కార్యకర్తల నియామకానికి ఆహ్వానం

ఒంగోలు టౌన్: నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా జిల్లాలోని రూరల్, అర్బన్ ప్రాంతాల్లో 63 మంది ఆశా కార్యకర్తల నియామకం కోసం దరఖాస్తులను జిల్లా వైద్యారోగ్య శాఖ ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ నుంచి జూలై 6వ తేదీ వరకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిస్ట్రిక్ట్ హెల్త్ సొసైటీ ద్వారా నియామకాలు చేస్తారని తెలిపారు.

క్లుప్తంగా

పారిశుధ్యంపై కేంద్ర బృందం తనిఖీలు


గుండువారిలక్ష్మీపురంలో పర్యటిస్తున్న కేంద్ర బృందం

చీమకుర్తి రూరల్: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ-2025 కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుండువారిలక్ష్మీపురం గ్రామంలో శనివారం కేంద్ర బృంద సభ్యులైన జి.రవివర్మ, సుధీర్, సందీప్ పర్యటించారు. పారిశుధ్యం నిర్వహణ, మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలనడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పారిశుధ్యం నిర్వహణపై సర్వే నిర్వహించి ఆయా పంచాయతీలకు ర్యాంకులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టి.శాంతిప్రియ, ఖాజావలి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వృద్ధుడి ఆత్మహత్య


రంగయ్య మృతదేహం

గిద్దలూరు రూరల్: పురుగుమందు తాగి ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన పట్టణంలోని నల్లబండ బజారు శివారు మేకల నరవ ప్రాంతంలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. రాచర్ల మండలం పుల్లలచెరువు గ్రామానికి చెందిన నల్లబోతుల రంగయ్య (64) నాలుగు రోజుల క్రితం ఇంటి వద్ద తన పెద్ద కుమారుడితో ఘర్షణ పడి గిద్దలూరు వెళ్లాడు. అక్కడ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విగతజీవిగా పడి ఉన్న రంగయ్యను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రంగయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య గతంలోనే మరణించింది. ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని మృతదేహం గుర్తింపు

టంగుటూరు: గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించిన సంఘటన మండలంలోని వల్లూరు గ్రామ పొలాల్లో శనివారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వల్లూరు జాతీయ రహదారి సమీప పొలాల్లో గుర్తుతెలియని పురుషుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి 35 నుంచి 50 ఏళ్లు ఉండొచ్చు. ఒంటిపై బ్రౌన్ రంగు కలిగి ఉన్న ఫుల్ హాండ్స్ షర్ట్, నల్ల కాటన్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. షర్ట్ కాలర్ వద్ద ఒంగోలులోని కమల్ టైలర్స్ లేబుల్ ఉంది. గుర్తుపట్టిన వెంటనే టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు 91211 02137 నంబర్‌ను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

రైలు కిందపడి వృద్ధుడి దుర్మరణం

టంగుటూరు: ప్రమాదవశాత్తు రైలు కిందపడి వృద్ధుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన స్థానిక రైల్వేస్టేషన్లో శనివారం ఉదయం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జరుగుమల్లి గ్రామానికి చెందిన పిలిమి సుబ్బారెడ్డి (69) తన భార్య కమలమ్మతో కలిసి కావలిలో వైద్య చికిత్స కోసం బయల్దేరాడు. రైల్వే స్టేషన్లో రైలు ఎక్కేందుకు ప్లాట్‌ఫాం మారే ప్రయత్నం చేశారు. గూడ్స్ రైలు కింద నుంచి దూరి అవతలి ప్లాట్‌ఫాంకు వెళ్లే ప్రయత్నం చేయగా ఒక్కసారిగా రైలు కదలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చెరుకొని ప్రమాదానికి కారణాలు పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

వేధింపుల బదిలీలు..!

- బదిలీల పేరుతో పంచాయతీ కార్యదర్శులపై కక్ష సాధింపులు
- సంఘ నాయకులుగా పనిచేస్తూ డీపీవోలో అక్రమాలపై ప్రశ్నించిన వారిపై వేధింపులు
- నిబంధనలకు నీళ్లొదిలి సుదూర ప్రాంతాలకు పంచాయతీ కార్యదర్శుల బదిలీలు
- అధికారుల తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు
- కూటమి పాలనలో ప్రశ్నించిన వారిని హింసిస్తున్నారనడానికి మరో నిదర్శనం





నాగులుప్పలపాడు: కూటమి ప్రభుత్వం, పాలకుల తీరుకు తాము ఏమాత్రం తీసిపోము అన్నట్లుగా జిల్లా పంచాయతీ అధికారులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. అవినీతి, అక్రమాలపై ప్రశ్నించిన వారిని లక్ష్యంగా చేసుకుని వేధించే విషయంలో కూటమి పాలకులు తానా అంటుంటే.. జిల్లా పంచాయతీ అధికారులు తందానా అంటున్నారు. బదిలీల పేరుతో పంచాయతీ కార్యదర్శులపై అధికారులు కక్ష సాధింపులకు పాల్పడటమే అందుకు నిదర్శనంగా ఉంది. పంచాయతీ కార్యదర్శుల సంఘ నాయకులుగా ఉండి జిల్లా పంచాయతీ కార్యాలయంలో జరిగిన అక్రమాలపై ప్రశ్నించిన కార్యదర్శులను అధికారులు టార్గెట్ చేశారు. నిబంధనల్లోని లొసుగులను అడ్డం పెట్టుకుని సుదూర ప్రాంతాలకు వారిని బదిలీ చేసి వేధిస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘించి మరీ...

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న బదిలీలకు సంబంధించిన నియమాలను పరిశీలిస్తే.. ఐదేళ్ల పాటు ఒకేచోట పనిచేసిన వారిని తప్పనిసరిగా వేరేచోటకు బదిలీ చేయాలి. లేకుంటే ఉద్యోగి పనిచేస్తున్న మండలం, అతని సొంత మండలం ఒకటే అయితే బదిలీ చేయాలి. కానీ, పంచాయతీ కార్యదర్శుల బదిలీల విషయంలో జిల్లా పంచాయతీ అధికారులు ఈ నిబంధనలను పూర్తిగా గాలికొదిలేశారు. ప్రస్తుతం జరుగుతున్న అవినీతి అక్రమాలపై ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ శ్రేణులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతున్న తరహాలో పంచాయతీ అధికారులు కూడా తమ పంచాయతీ కార్యదర్శులపై బదిలీల పేరుతో వేధింపులకు పాల్పడుతున్నారు. బదిలీలను తమకు అనుకూలంగా మార్చుకుని అడ్డగోలుగా కార్యదర్శులను బదిలీ చేస్తున్నారు.


సంఘంలో పనిచేసిన వారే లక్ష్యంగా...

జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘంలో పనిచేసిన వారిపై మరింతగా అధికారులు కక్ష సాధింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది అక్రమాలపై గొంతెత్తడంతో పాటు కూటమి ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలో జరిగిన బదిలీల్లో జిల్లా పంచాయతీ కార్యాలయంలో తిష్ట వేసుకుని కూర్చుని బదిలీల్లో అవకతవకలకు పాల్పడి లక్షల్లో డబ్బు వసూలు చేసిన ఉద్యోగులపై కోర్టులకు వెళ్లడంతో సంబంధిత కార్యదర్శులను పలు రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కురిచేడు, నాగులుప్పలపాడు, అద్దంకి, మార్కాపురం ప్రాంతాల్లో పనిచేస్తున్న సుమారు 20 మంది పంచాయతీ కార్యదర్శులను ఆయా మండలాలు వారి సొంత మండలాలు కానప్పటికీ, ప్రస్తుతం వారు పనిచేస్తున్న మండలాలకు వచ్చి ఐదేళ్లు పూర్తికానప్పటికీ జిల్లా స్థాయి అధికారుల తప్పిదాలను ఎత్తి చూపడంతో పాటు గతంలో జరిగిన అడ్డగోలు బదిలీలు, పదోన్నతులు, అక్రమాలపై ఆధారాలతో కోర్టులకు వెళ్లారనే కారణంతో ప్రస్తుతం సుదూర ప్రాంతాలకు బదిలీ చేసి వేధిస్తున్నారు. కోర్టు కేసులకు సంబంధించి కలెక్టర్‌తో పాటు జిల్లా పంచాయతీ అధికారి కూడా స్పందించాల్సి ఉండటాన్ని అవమానకరంగా భావించిన జిల్లా అధికారులు.. సంబంధిత పంచాయతీ కార్యదర్శులను ఆయా మండలాల నుంచి దూరంగా బదిలీ చేయాలని ఆదేశాలిచ్చినట్లు సమాచారం.

> **బదిలీల్లో పారదర్శకత లేదు**
>
> పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో ఉన్నతాధికారులు నిబంధనలు పాటించడం లేదు. ప్రస్తుతం పనిచేస్తున్న మండలాల్లో పనిచేయడానికి అర్హత ఉన్నప్పటికీ బలవంతంగా బదిలీలు చేపట్టడం చాలా బాధాకరం. ఇప్పటికే ఈ అంశంపై కోర్టులకు కూడా వెళ్లాం. చట్టపరంగా తమకు న్యాయం జరిగేంత వరకు మా హక్కుల కోసం పోరాడతాం.
>
> – మెరుగోలు బెన్‌హర్, పంచాయతీ సెక్రటరీల సంఘ జిల్లా అధ్యక్షుడు

వాట్సాప్ గ్రూపుల ద్వారా ఎంపీడీఓలకు పంపించి...

టార్గెట్ చేసిన పంచాయతీ కార్యదర్శులను సుదూర ప్రాంతాలకు బదిలీ చేయాలనే ఆదేశాలను సంబంధిత మండలాల ఎంపీడీఓలకు వాట్సాప్ గ్రూపుల ద్వారా పంపించినట్లు సమాచారం. తాము చెప్పిన కార్యదర్శులను తక్షణమే ఆయా మండలాల నుంచి బదిలీ చేయాలని నేరుగా జిల్లా పంచాయతీ అధికారే రంగంలోకి దిగి ఎంపీడీవోలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. జిల్లా పంచాయతీ కార్యాలయంలో అక్రమాలకు పాల్పడుతున్న అధికారులను తాము ప్రశ్నించిన పాపానికి తమను బదిలీ చేసినట్లు చూపించి ప్రస్తుతం తాము పనిచేస్తున్న గ్రామ పంచాయతీలలో లాగిన్‌లు కూడా ఆపివేశారని సంబంధిత కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఇంత అవినీతి జరిగిన విషయం ఇప్పటికే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా వారిపై విచారణ జరిపి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఫిర్యాదుదారులపై జిల్లా పంచాయతీ కార్యాలయం అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని పలువురు కార్యదర్శులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే తమ విధులకు ఆటంకం కలిగిస్తూ లాగిన్‌లు ఆపడంతో పాటు తమకు ఆయా మండలాల్లో జీతాలు పెట్టొద్దని కూడా డీపీవో ఆదేశాలు జారీ చేశారని ఎంపీడీవోల ద్వారా తెలుసుకున్న బాధిత పంచాయతీ కార్యదర్శులు తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పంచాయతీ కార్యదర్శుల లాగిన్‌లు ఆపివేయడంతో ఖాళీగా కనిపిస్తున్న పంచాయతీ వివరాలు

కారు, ఆటో ఢీ

- ఇద్దరు దుర్మరణం
- ఎనిమిది మందికి గాయాలు


నారాయణమ్మ (ఫైల్)


ధ్వంసమైన కారు

కొనకనమిట్ల: దైవ దర్శనానికి వెళ్తున్న కారు, ప్రయాణికులతో వెళ్తున్న ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఆటోలో ఉన్న ఇద్దరు ప్రయాణికులు దుర్మరణం చెందగా మరో ఎనిమిది మంది గాయపడ్డారు. ఈ సంఘటన ఒంగోలు–గిద్దలూరు రహదారి మండలంలోని చినారికట్ల జంక్షన్ సమీపంలో శనివారం జరిగింది. వివరాలు.. మండలంలోని ఓబులరెడ్డిపల్లికి చెందిన చెన్నయ్య తన ఆటోలో కాట్రగుంట, వెంగలపల్లి, గొట్లగట్టుకు చెందిన ప్రయాణీలను ఎక్కించుకుని పొదిలి వెళ్తున్నాడు. ఆటో చినారికట్ల జంక్షన్ సమీపంలోకి వచ్చే సరికి చీమకుర్తికి చెందిన శివ తన కారులో కుటుంబ సభ్యులతో కలిసి గిద్దలూరు దగ్గర ఉన్న నెమలిగుండ్ల రంగనాయకస్వామి గుడికి దైవదర్శనం కోసం వెళ్తున్నారు. ఆ క్రమంలో అదుపు తప్పిన కారు, ఆటో ఢీకొన్నాయి. ఆటో రోడ్డు మార్జిన్ పక్కన ఉన్న రాళ్ల గుట్టపై పడటంతో ఆటోలో ఉన్న కాట్రగుంట గ్రామానికి చెందిన మూడమంచు బాలయ్య (55) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కాట్రగుంట పంచాయతీ వెంగళపల్లి గ్రామానికి చెందిన మోరా నారాయణమ్మ (55) తీవ్రంగా గాయపడగా మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. అదే ఆటోలో ఉన్న నారాయణమ్మ భర్త ఆదినారాయణ కూడా గాయపడి పొదిలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఆటో తోలుతున్న చెన్నయ్య తీవ్రంగా గాయపడి పొదిలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. మృతి చెందిన బాలయ్యకు భార్య కొండమ్మ, నలుగురు పిల్లలు ఉన్నారు. మృతురాలు నారాయణమ్మకు భర్త ఆదినారాయణ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాదంలో గాయపడిన మిగిలిన ప్రయాణికులు పొదిలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. కారులో ఉన్న వారు కూడా గాయపడగా వారిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ప్రభాకర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి కారణాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం కోసం బాలయ్య, నారాయణమ్మ మృతదేహాలను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాట్రగుంట పంచాయతీలో కాట్రగుంట, వెంగళపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందటంతో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.


మృతి చెందక ముందు తీవ్రంగా గాయపడిన నారాయణమ్మ


సంఘటన స్థలంలో బాలయ్య మృతదేహం


ప్రభుత్వ వైద్యశాలలో క్షతగాత్రులు

ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

- జిల్లా వ్యాప్తంగా జేసీ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్


గ్యాస్ గోడౌన్‌లో సిలిండర్లను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

ఒంగోలు సబర్బన్: జిల్లా వ్యాప్తంగా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ నేతృత్వంలో వివిధ విభాగాల అధికారులు శనివారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లాలోని అన్నీ ప్రభుత్వ శాఖలు కలిసికట్టుగా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో రెవెన్యూ, పౌరసరఫరాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రోలజీ, ఫైర్ డిపార్ట్‌మెంట్, రూరల్ వాటర్ సప్లయ్, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పెట్రోలు బంకులు, గ్యాస్ ఏజెన్సీలు, రేషన్ షాపులు, ఎంఎల్ఎస్ పాయింట్స్, రైస్ మిల్లులు, బాణసంచా గోడౌన్లు, వాటర్ ఆర్‌ఓ ప్లాంట్లు, హోటల్స్, బఫర్ గోడౌన్స్, సినిమా హాల్స్ తనిఖీ చేశారు. ఇప్పటి వరకు పెట్రోలు బంకులు 47, గ్యాస్ ఏజెన్సీలు–31, రేషన్ షాపులు–88, ఎంఎల్ఎస్ పాయింట్స్–10, రైస్ మిల్లులు–7, బాణసంచా గోడౌన్లు–5, వాటర్ ఆర్‌ఓ ప్లాంట్లు–26, ఆర్టీసీ బస్ స్టాండ్స్–5, సినిమా హాల్స్–9, హోటల్స్–2, బఫర్ గోడౌన్–1 తనిఖీ చేపట్టారు. మొత్తం 231 చోట్ల అధికారులు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్‌తో పాటు మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ వరలక్ష్మి, ఒంగోలు, కనిగిరి రెవెన్యూ డివిజనల్ అధికారులు కె.లక్ష్మీప్రసన్న, జి.కేశవర్ధన్‌రెడ్డి, సహాయ సరఫరా అధికారి ఐ.పుల్లయ్య, జిలాలోని అందరు తహసీల్దార్లు, సివిల్ సప్లయీస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది ప్రత్యేక తనిఖీల్లో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రకాశం వాసి దుర్మరణం


పేరారెడ్డి (ఫైల్)


పేరారెడ్డి మృతదేహం

మదనపల్లె రూరల్: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ప్రకాశం జిల్లా వాసి దుర్మరణం చెందిన ఘటన శనివారం కర్ణాటక సరిహద్దులోని రాయల్పాడు సమీపంలో జరిగింది. ప్రకాశం జిల్లా పెద్దచెర్లోపల్లె పంచాయతీ ముర్గాని గ్రామానికి చెందిన ఎరుకులయ్య కుమారుడు పెద్దిరెడ్డి గారి పేరారెడ్డి (32) ద్విచక్ర వాహనంపై మదనపల్లె మీదుగా బెంగళూరు వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యంలోని కర్ణాటక సరిహద్దు రాయల్పాడు వద్ద ఎదురుగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పేరారెడ్డిని స్థానికుల సాయంతో రాయల్పాడు పోలీసులు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అత్యవసర విభాగ వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మార్చురీకి తరలించారు. మృతుడి జేబులోని ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్‌లోని నంబర్ల ఆధారంగా ఆచూకీని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. రాయల్పాడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కేంద్ర న్యాయశాఖలో కరవది విద్యార్థినికి ఇంటర్న్‌షిప్ అవకాశం


అంజనప్రియ

ఒంగోలు సిటీ: ఒంగోలు మండలంలోని కరవది గ్రామానికి చెందిన సత్యాల అంజనప్రియకు కేంద్ర న్యాయశాఖలో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం దక్కింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్శిటీలో 5వ సంవత్సరం న్యాయ విద్య అభ్యసిస్తున్న అంజనప్రియ భారత ప్రభుత్వ న్యాయ మంత్రిత్వశాఖకు చెందిన న్యాయ వ్యవహారాల విభాగం నిర్వహించిన జూలై–2025 ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంకు ఎంపికయ్యారు. ఈ ఇంటర్న్‌షిప్ న్యాయమంత్రిత్వ శాఖ ప్రధాన కార్యాలయమైన మెయిన్ సెక్రటేరియట్, శాస్త్రి భవన్, న్యూఢిల్లీలో జూలై 1 నుంచి ప్రారంభమవుతుంది. విద్యార్థినికి ఈ ఇంటర్న్‌షిప్ ద్వారా న్యాయ విధానాలపై ఆచరణాత్మక అవగాహన, అనుభవం పొందే అవకాశం లభించనుంది. దేశం మొత్తం మీద 50 మందినే ఎంపిక చేస్తారు. అసాధారణ రీతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ స్థాయిలో నేరుగా పని చేసే అరుదైన అవకాశం వస్తుందని, అలాంటి అవకాశం కరవది విద్యార్థినికి రావడం విశేషమని పలువురు అభినందించారు.

ఇంగ్లిష్ బోధించేందుకు దరఖాస్తు చేసుకోవాలి

నాగులుప్పలపాడు: మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలో ఏపీ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో 5 నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లిష్ బోధించేందుకు బీఈడీ, పీజీ అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.మాధవి తెలిపారు. పూర్తి వివరాలకు 87126 25043 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విమానాల ల్యాండింగ్‌కు భూసేకరణ


విమానాల రన్‌వే స్థలం

సింగరాయకొండ: విమానాల ఎమర్జెన్సీ ల్యాండింగ్ అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవుతాయని, ఇందుకోసం అవసరమైన భూసేకరణ చేపట్టాల్సి ఉందని, త్వరలో ప్రభుత్వం నుంచి నోటిఫికేషన్ జారీ అవుతుందని వెలుగొండ ప్రాజెక్టు భూసేకరణ స్పెషల్ కలెక్టర్ ఎం.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం ఆయన డిప్యూటీ తహసీల్దార్ టి.ప్రసాద్, సర్వేయర్ బ్రహ్మంతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. భూసేకరణకు సంబంధించి వారం రోజుల్లో విధివిధానాలు వస్తాయని, మార్కింగ్ చేస్తామని చెప్పారు. ఆ తర్వాత ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు ఇరువైపులా స్థలాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. అధికారులు మాట్లాడుతూ ఎమర్జెన్సీ ల్యాండింగ్ అభివృద్ధి పనులు త్వరలో చేపడతామని, ఇందుకోసం నిధులు కూడా మంజూరయ్యాయన్నారు. గతంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్‌ను ఎక్కడా వంకర లేకుండా నిర్మించాల్సి ఉండగా కొంతమేర వంకరగా నిర్మించడంతో రన్‌వేకు పనికిరాదని ఎయిర్‌ఫోర్స్ అధికారులు నిర్ణయించారని, ఇప్పుడు రన్‌వే వంకర సరి చేసేందుకు రోడ్డుకు ఇరువైపులా 6 మీటర్ల చొప్పున స్థల సేకరణ చేయాల్సి ఉంటుందని తెలిపారు. అప్పుడు రన్‌వేను నిబంధనల ప్రకారం నిర్మిస్తామని వివరించారు.

మార్కాపురం మీదుగా ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు

మార్కాపురం: నాందేడ్ నుంచి తిరుపతి వరకూ మార్కాపురం మీదుగా ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును జూలై 4, 11, 18, 25 తేదీల్లో ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు మార్కాపురం పట్టణానికి చెందిన గుంటూరు డీఆర్‌ఈసీసీ మెంబర్ ఆర్‌కేజే నరసింహం తెలిపారు. ఈ రైలు నాందేడ్‌లో సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి నిజామాబాద్, కామారెడ్డి, నల్గొండ, నడికుడి, పిడుగురాళ్ల మీదుగా వినుకొండ, దొనకొండ, మార్కాపురం రోడ్, కంభం, గిద్దలూరు, నంద్యాల, రాజంపేట, రేణిగుంట మీదుగా తిరుపతి చేరుతుందని వివరించారు. ఈ రైలు మార్కాపురం రోడ్ స్టేషన్‌కు వచ్చేసరికి తెల్లవారుజామున 3 గంటలు అవుతుందని, అదేరోజు మధ్యాహ్నం తిరుపతి చేరుతుందని తెలిపారు. మళ్లీ తిరిగి అదే రైలు మధ్యాహ్నం 2.20 గంటలకు బయలుదేరి రాత్రి 9.30 గంటలకు మార్కాపురం చేరుతుందని చెప్పారు. ప్రస్తుతానికి ప్రతి శుక్రవారం తిరుపతి వెళ్లేందుకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని తిరుపతివెళ్లే వారు వినియోగించుకోవాలని కోరారు. ఇందులో ఏసీ టూటైర్, త్రీటైర్, స్లీపర్, జనరల్ బోగీలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.